రోడ్డు పనులు పూర్తి చేయాలి

జగద్గిరిగుట్ట: డివిజన్‌ పరిధిలోని శివనగర్‌లో సీసీ రోడ్డు పనులను పూర్తి చేయాలని కార్పొరేటర్‌ జగన్‌ డిమాండ్‌ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. అధికార పార్టీ నాయకులు అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారని ఆయన ఆరోపించారు. 3 నెలల క్రితం ప్రారంభమైన పనులు ముందుకు సాగకపోవడం సిగ్గుచేటన్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. పనులు ప్రారంభించి పూర్తి చేయకుంటే జోనల్‌ కమిషనర్‌ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

బీసీ రిజర్వేషన్‌, ఎస్సీ వర్గీకరణపై లోక్‌ సత్తా హర్షం

కుత్బుల్లాపూర్‌: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నందుకు లోక్‌ సత్తా పార్టీ హర్షం వ్యక్తం చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నందిపేట రవీందర్‌ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో పోటీ చేయబోయే అన్ని పార్టీలు 42 శాతం బీసీ లకు కేటాయించాలని కోరారు. ప్రభుత్వం కాలయాపన చేయకుండా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు.

సర్వే డబ్బులు చెల్లించాలని ఆందోళన


ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

కుత్బుల్లాపూర్‌: సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న తమకు డబ్బులు చెల్లించాలని అంగన్‌వాడీ టీచర్లు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు బుధవారం సర్కిల్‌ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. సర్వేలో పాల్గొన్న అందరికీ డబ్బులు ఇచ్చినప్పటికీ అంగన్‌వాడీ టీచర్లకు ఇవ్వకపోవడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. నెల రోజులుగా కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని, ఇదేమని ప్రశ్నిస్తే అకౌంటు లింకు కాలేదని తప్పించుకుంటున్నారన్నారు. వెంటనే చెల్లించాలని, లేకుంటే ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

విజేఐఈటీలో సిన్టిలేషన్జ్‌ 25 వేడుకలు


విద్యార్థినుల నృత్య ప్రదర్శన

నిజాంపేట్‌: ప్రగతినగర్‌ వీఎన్‌ఆర్‌ విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ ఇంజినీరింగ్‌ అండ్‌ టెక్నాలజీ ప్రాంగణంలో రెండోవ రోజు సిన్టిలేషన్జ్‌ 25 వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో బుధవారం పలువురు గాయకులు తమ గానంతో ప్రేక్షకులను అలరించారు. కళాశాలకి చెందిన శాస్త్రీయ నృత్య విద్యార్థి కూటమి నృత్యతరంగ్‌ సభ్యులు తమ నాట్యంతో ప్రేక్షకులకు ఆనందాన్ని పంచారు.

కళాశాల వార్షికోత్సవం .. మెరిసిన సినీ హీరోలు..



మల్లారెడ్డితో హీరో విజయ దేవరకొండ

సుభాష్‌నగర్‌: సూరారంలోని మల్లారెడ్డి మెడికల్‌, డెంటల్‌, ఇంజినీరింగ్‌ కళాశాల వార్షికోత్సవం బుధవారం రాత్రి జోష్‌గా జరిగింది. కార్యక్రమానికి సినీ హీరో నితిన్‌, విజయ దేవరకొండ, ఎమ్మెల్యే కేపీ వివేకానంద ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సినీహీరోల రాకతో ప్రాంగణం సందడిగా మారింది. విద్యార్థులు నృత్యాలు ఉర్రూతలూగించాయి.

గ్రానైట్‌ బండలు పడి కార్మికుడి మృతి


పప్పుయాదవ్‌(ఫైల్‌)

కుత్బుల్లాపూర్‌: గ్రానైట్‌ బండలు మీద పడటంతో ఓ కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన పేట్‌బషీరాబాద్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్‌కు చెందిన పప్పుయాదవ్‌ (40) లేబర్‌ పనులు చేస్తుంటాడు. బుధవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో దండమూడి ఎన్‌క్లేవ్‌లో లారీ నుంచి గ్రానైట్‌ బండలు దించుతున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు బండలు మీద పడటంతో ఊపిరాడక మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇక నిరంతర విద్యుత్‌!

- సమ్మర్‌ ప్లాన్‌ సిద్ధం చేసిన అధికారులు
- 12.5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ ఏర్పాటు
- హర్షం వ్యక్తం చేస్తున్న కాలనీ వాసులు


సబ్‌ స్టేషన్‌లో 12.5 ఎంవీఏ వద్ద విద్యుత్‌ అధికారులు, సిబ్బంది

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట విద్యుత్‌ సబ్‌ స్టేషన్‌ పరిధిలో అంతరాయం లేని విద్యుత్‌ సరఫరే లక్ష్యంగా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. వేసవిలో విద్యుత్‌ అంతరాయం కలుగకుండా సమ్మర్‌ యాక్షన్‌ ప్లాన్‌లో భాగంగా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా విద్యుత్‌ కనెక్షన్‌లు పెరగడం, ఫీడర్ల మీద లోడ్‌ పడటంతో తరుచూ విద్యుత్‌ అంతరాయం కలుగుతుంది. వినియోగదారుల నుంచి ఫిర్యాదులు కూడా ఎక్కువయ్యాయి. దీంతో సమస్య పరిష్కారానికి 12.5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ ఏర్పాటు చేశారు.

సబ్‌ స్టేషన్‌ పరిధిలో 6 ఫీడర్లు

సబ్‌ స్టేషన్‌ పరిధిలో శ్రీనివాస్‌ నగర్‌, మగ్దూం నగర్‌, వేంకటేశ్వర నగస్‌, షిరిడీ హిల్స్‌, జగద్గిరిగుట్ట, ఐడీఏలలో 11 కేవీకి సంబంధించి మొత్తం 6 ఫీడర్లు ఉన్నాయి. ప్రతీ ఫీడర్‌ నుంచి సుమారు 30 వేల కనెక్షన్‌లకు విద్యుత్‌ సరఫరా అవుతుంది. అలాగే ఒక్కో ఫీడర్‌కి 20 ట్రాన్స్‌ఫార్మర్లు వినియోగంలో ఉన్నాయి.

2 లక్షలకు పైగా కనెక్షన్‌లు

జగద్గిరిగుట్ట సబ్‌ స్టేషన్‌ పరిధిలో సుమారు 2 లక్షలకు పైగా విద్యుత్‌ కనెక్షన్‌లు ఉన్నాయి. దీంతో నిత్యం ఏదో ఒక చోట విద్యుత్‌ అంతరాయం ఏర్పడుతుంది. సరఫరాలో ఫీడర్‌లపై లోడ్‌ పడటంతో దీనిని మళ్లీ రిపేర్‌ చేయడానికి తగినంత సమయం కూడా సరిపోవడం లేదు. 12.5 ఎంవీఏ ఏర్పాటుతో సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికినట్లైంది.

పెరిగిన విద్యుత్‌ వినియోగం

రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల విద్యుత్‌ వినియోగం ఎక్కువైంది. ఫీడర్లు, ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్‌ పడటంతో విద్యుత్‌ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. దీంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. సబ్‌ స్టేషన్‌లో రెండు 8 ఎంవీఏలు ఉండేవి. విద్యుత్‌ సరఫరా అంతరాయం కలగుతుండటంతో ఇందులో నుంచి ఒకదానిని తొలగించి కోటి రూపాయల వ్యయంతో 12.5 ఎంవీఏ అమర్చారు. దీని ద్వారా ఇకముందు విద్యుత్‌ అంతరాయానికి చెక్‌ పడవచ్చని అధికారులు భావిస్తున్నారు.

విద్యుత్‌ సరఫరాలో ఇబ్బందులు ఉండవు



సమ్మర్‌ యాక్షన్‌ ప్లాన్‌లో భాగంగా 12.5 మెగా వోల్ట్‌ ఆంపియర్‌ను ఏర్పాటు చేశాం. దీంతో ఇక ముందు విద్యుత్‌ సరఫరాలో ఇబ్బందులు రాకపోవచ్చు. ఒక వేళ సమస్యలు వచ్చినా వెంటనే మరమ్మతులు చేయడానికి తమ సిబ్బంది సిద్ధంగా ఉన్నారు.

– రాధాకృష్ణ, సబ్‌ స్టేషన్‌ ఏఈ

బడ్జెట్‌లో విశ్వనగరాన్ని విస్మరించారు

బీఆర్‌ఎస్‌ శాసనసభ విప్‌ వివేకానంద్‌



కుత్బుల్లాపూర్‌: హైదరాబాద్‌ నగరాభివృద్ధికి ప్రతి యేటా రూ.10 వేల కోట్ల నిధులు కేటాయిస్తామని డంకా భజాయించిన సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర బడ్జెట్‌లో ఉత్త చేతులు చూపారని బీఆర్‌ఎస్‌ శాసనసభ విప్‌, ఎమ్మెల్యే వివేకానంద్‌ ఎద్దేవా చేశారు. తెలంగాణ బడ్జెట్‌ సమావేశంలో భాగంగా బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మహానగరాభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించకపోవడంపై సరికాదన్నారు. బడ్జెట్‌లో మెట్రో రైలు విస్తరణకు నిధులు కేటాయించలేదన్నారు. గత బీఆర్‌ఎస్‌ హయాంలో పనులు చేపట్టి పూర్తి చేసిన ఎస్‌ఎన్‌డీపీ, ఎస్‌ఆర్‌డీపీ పనులను కాంగ్రెస్‌ ప్రభుత్వం పూర్తి చేసిందని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. కేసీఆర్‌ హయాంలో శంకుస్థాపన చేసిన మల్టీ స్పెషాలిటీ, సూపర్‌ స్పెషాలిటీ ఆసుపత్రులకు నిధులు కేటాయించలేదని విమర్శించారు. పేద, మధ్యతరగతి ప్రజల వైద్య సేవలపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తన ఊహల నగరమైన ఫ్యూచర్‌ సిటీ కేంద్రంగా నిధులు కేటాయించి రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారంతో ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు.

నల్లపోచమ్మ ఆలయంలో పూజలు


పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌

రంగారెడ్డినగర్‌: ఆలయాల సందర్శనతో ఆధ్యాత్మిక చింతన నెలకొంటుందని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ అన్నారు. రంగారెడ్డినగర్‌ డివిజన్‌ ఇందిరా గాంధీనగర్‌లోని నల్లపోచమ్మ ఆలయంలో అమ్మవారి కైంకర్య పునః ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శంకర్‌ గౌడ్‌, గోపాల్‌యాదవ్‌, మోహన్‌ గౌడ్‌, మడికే విజయ్‌, నర్సింగ్‌ యాదవ్‌, శ్రీనివాస్‌ యాదవ్‌ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి


కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మేయర్‌ నీలాగోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు

నిజాంపేట్‌: విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని మాజీ మేయర్‌ నీలాగోపాల్‌రెడ్డి అన్నారు. జడ్పీ హెచ్‌ఎస్‌ నిజాంపేట్‌ పాఠశాల వార్షిక వేడకలు బుధవారం హెచ్‌ఎం రఘునాథ్‌ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిరుపేద విద్యార్థులకు తనవంతు సహకారం అందిస్తానన్నారు. అనంతరం బాచుపల్లి ఎంఈఓ రామకృష్ణ మాట్లాడుతూ.. రానున్న పదోతరగతి పరీక్షల్లో విద్యార్థులు మండలాన్ని మొదటిస్థానంలో నిలపాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్‌ ఆకుల పావని, రాంరెడ్డి, ఆనంద్‌రెడ్డి, మదన్‌, విట్టల్‌, నర్సింహులు, ప్రమోద్‌ కుమార్‌రెడ్డి, శేఖర్‌, ఠాగూర్‌, ప్రదీప్‌సింగ్‌, విజయ, భాస్కర్‌రెడ్డి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

సెయింట్‌ మార్టిన్స్‌ కళాశాలలో ఇఫ్తార్‌ విందు


ఇఫ్తార్‌ విందులో పాల్గొన్న కళాశాల యాజమాన్యం, ముస్లింలు

సుభాష్‌నగర్‌: ముస్లింలకు ఎంతో పవిత్రమైన రంజాన్‌ మాసంలో ఇఫ్తార్‌ విందుకు ఎంతో ప్రాముఖ్యత ఉందని సెయింట్‌ మార్టిన్స్‌ ఇంజినీరింగ్‌ కళాశాల చైర్మన్‌ మర్రి లక్ష్మణ్‌రెడ్డి అన్నారు. బుధవారం దూలపల్లిలోని కళాశాల ఆవరణలో ముస్లింలకు ఇఫ్తార్‌ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత సామరస్యానికి ప్రతీకగా రంజాన్‌ నిలుస్తుందని, ప్రశాంత వాతావరణంలో ప్రార్థనలు జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్‌ డాక్టర్‌ సంతోష్‌కుమార్‌ పాత్రా, ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ చంద్రశేఖర్‌ యాదవ్‌, ముస్లింలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వైద్యాధికారి ఆకస్మిక తనిఖీ

నిబంధనలు పాటించని పలు క్లినిక్‌లు సీజ్‌


క్లినిక్‌ను సీజ్‌ చేస్తున్న వైద్యాధికారులు

జగద్గిరిగుట్ట/నిజాంపేట్‌: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్‌ సి. ఉమా గౌరి బుధవారం జగద్గిరిగుట్ట, బాచుపల్లిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీలో భాగంగా జగద్గిరిగుట్టలో హాసిని ఫస్ట్‌ ఎయిడ్‌ క్లినిక్‌ను సీజ్‌ చేశారు. ఫార్మ్‌–డి అర్హత ఉన్న ప్రతీక్‌ అనే వ్యక్తి నకిలీ జనరల్‌ ఫిజీషియన్‌గా అవతారమెత్తి చికిత్స అందిస్తున్నాడు. దీంతో సీజ్‌ చేసి నోటీసులు అందజేశారు. అదేవిధంగా బాచుపల్లిలోని సహజ పాలీ క్లినిక్‌, బుచ్చిబాబు ఫస్ట్‌ ఎయిడ్‌ సెంటర్‌ను సీజ్‌ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అనుభవం లేని వ్యక్తులు చట్టాన్ని ఉల్లంఘిస్తూ అక్రమంగా మందులు, ఇష్టానుసారంగా యాంటీబయాటిక్స్‌ రాయడం జరుగుతుందని అన్నారు. ఇలాంటి వారి వద్ద ట్రీట్‌మెంట్‌ తీసుకోకుండా ప్రజలు అప్రమత్తంగా ఉడాలని సూచించారు.

పార్కింగ్‌ చేసిన కారులో మంటలు

దుండిగల్‌: పార్కింగ్‌ చేసిన కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగి దగ్ధమైంది. ఈ ఘటన దుండిగల్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మియాపూర్‌ మాతృశ్రీనగర్‌కు చెందిన కె.కల్పనా రాణి ఉపాధ్యాయురాలిగా పని చేస్తుంది. తన కుమార్తె ఇంటర్‌ మొదటి సంవత్సర పరీక్ష ఉండటంతో బౌరంపేటలోని శ్రీ చైతన్య కళాశాల సెంటర్‌కు బుధవారం ఉదయం తన కారులో తీసుకొచ్చింది. పరీక్ష ముగిసే వరకు పక్కనే వేచి చేస్తుంది. ఈ క్రమంలో మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఒక్క సారిగా కారులో మంటలు చెలరేగాయి. ఫైర్‌ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆరిపేశారు. ఈ మేరకు దుండిగల్‌ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



రేపటి నుంచి పదోతరగతి పరీక్షలు

- 5 నిమిషాలు ఆలస్యమైనా రానివ్వం
- జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి



సాక్షి,సిటీబ్యూరో: పదో తరగతి వార్షిక పరీక్షలు ఈనెల 21 నుంచి వచ్చే నెల 4 వరకు పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి తెలిపారు. సైన్స్‌కు సంబంధించిన రెండు పేపర్లు మినహాయించి, మిగతా పరీక్షలు నిర్దేశించిన టైమ్‌టేబుల్‌ ప్రకారం ప్రతిరోజు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయన్నారు. గ్రేస్‌ పిరియడ్‌ 5 నిమిషాలు మాత్రమే ఉంటుందని, ఉదయం 9.35 గంటల తర్వాత వచ్చిన విద్యార్థులను పరీక్ష హాల్‌లోకి అనుమతించబోమని బుధవారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు.

◆ సైన్స్‌ పేపర్‌ (పార్టు) 1,2 పరీక్షలను మాత్రం నిర్దేశించిన తేదీల్లో ఉదయం 9.30 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ఉదయం 8.30 గంటల వరకే చేరుకునేలా ఏర్పాట్లు చేసుకోవాలని ఆమె సూచించారు. పరీక్ష కేంద్రాలను కూడా పరీక్షలకు రెండ్రోజుల ముందే గుర్తించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

◆ మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లాలోని 15 మండలాల పరిధిలో పదోతరగతి పరీక్షల నిర్వహణకు 230 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, 47,930 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారన్నారు. వీరిలో 609 మంది ప్రైవేట్‌ విద్యార్థులు ఉన్నారన్నారు.

ఫోన్లు, ఎలక్ట్రానిక్‌ గాడ్జెట్స్‌ అనుమతి లేదు..

పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులు మొబైల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్‌ గాడ్జెట్స్‌ తీసుకురావొద్దని డీఈఓ విజయకుమారి తెలిపారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాల్లోకి హాల్‌టికెట్‌, పరీక్షప్యాడ్‌, పెన్‌, పెన్సిల్‌, స్కేల్‌ వారి వెంట తీసుకోవచ్చన్నారు. పరీక్షల నిర్వహణకు 3,200 మంది ఇన్విజిలేటర్లతో సహా 567 మంది చీఫ్‌ సూపరింటెండెంట్లు (సీఎస్‌),డిపార్ట్‌మెంట్‌ ఆఫీసర్లను నియమించామన్నారు. అన్నీ పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, వాటి పర్యవేక్షణలోనే పరీక్షలు జరుగుతాయన్నారు. 15 మంది ఫ్లైయింగ్‌ స్క్వాడ్‌లను నియమించడంతో పాటు కేంద్రాల సంఖ్యకు అనుగుణంగా సిట్టింగ్‌ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామన్నారు.

దుండిగల్‌లో గ్రంథాలయం ప్రారంభం


లైబ్రరీలో పుస్తకాలను పరిశీలిస్తున్న అధికారులు

దుండిగల్‌: విద్యార్థులు, పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యే అభ్యర్థుల కోసం గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తున్నామని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్‌ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. దుండిగల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన పౌర పఠన కేంద్రాన్ని బుధవారం మహారాష్ట్ర రిటైర్డ్‌ డీజీపీ వెంకటీ శంగుప్తాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామాల్లో గ్రంథాలయాలను ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా సెక్రటరీ సురేష్‌, సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు కావలి గణేశ్‌, మాజీ కౌన్సిలర్‌ గోపాల్‌రెడ్డి, నేతలు అమరం ముత్యంరెడ్డి, జక్కుల మల్లేశ్‌ యాదవ్‌, వెంకటేశ్‌, బాలరాజు, విఘ్నేశ్వర్‌, నర్సింహ, మోహన్‌, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మా స్థలమంటూ రోడ్డును తవ్వారు!



కుత్బుల్లాపూర్‌: మా స్థలం అంటూ ముగ్గురు వ్యక్తులు ఏకంగా ప్రధాన రోడ్డును జేసీబీతో తవ్వించారు. గాజులరామారం సర్కిల్‌ పరిధిలో ఓక్షిత్‌ ఎన్‌క్లేవ్‌ రోడ్డు నంబర్‌ 4 ఆయా ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు ఇటువైపుగా వస్తూ పోతుంటారు. 30 ఫీట్ల ఈ రోడ్డును స్థానిక రియల్‌ వ్యాపారి తమకు చెందిన స్థలం ఇవ్వడం లేదంటూ నేరెళ్ల జ్యోతి, శ్యాం కుమార్‌, శంకరయ్య ముగ్గురు కలిసి జేసీబీ సాయంతోబుధవారం ఉదయం రోడ్డు తవ్వుతున్న విషయాన్ని గుర్తించిన కాలనీవాసులు అడ్డు తగిలారు. అయినా వారు వినిపించుకోకుండా తవ్వడంతో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు సైబరాబాద్‌ కమిషనర్‌ అవినాష్‌ మహంతికి వాట్సాప్‌లో సమాచారాన్ని అందజేశారు. 10 నిమిషాల్లో సూరారం పోలీస్‌ పెట్రో మొబైల్‌ వారు చేరుకున్నారు. వారు కొద్దిసేపు వాగ్వాదం చేసుకొని వెళ్లిపోయారు. ఈ విషయంపై స్థానికులు సురపరాజు, కిరణ్‌ కుమార్‌, అలీ, సూరారం సీఐ భరత్‌ కుమార్‌తో పాటు ఉప కమిషనర్‌ మల్లారెడ్డికి ఫిర్యాదు చేశారు. రోడ్డును తవ్వి వదిలేయడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో కాలనీ వాసులు రోడ్డును పూడ్చారు.

సకాలంలో వేతనాలు చెల్లించాలి


వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాస్‌ తదితరులు

నిజాంపేట్‌: మున్సిపల్‌ కార్పొరేషన్‌లో పనిచేసే కార్మికులకు, ఔట్‌ సోర్సింగ్‌ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఉజ్జయిని హరినాథ్‌రావు, ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాస్‌ డిమాండ్‌ చేశారు. బుధవారం కమిషనర్‌ షాబేర్‌ అలీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి నెల వేతనం ఆలస్యంగా రావడం వల్ల ఇల్లు కిరాయిలు, ఇతర నిత్యావసర సరుకులకు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కనీసం ప్రతి నెల 7వ తేదీలోగా జీతాలు చెల్లించాలని కోరారు. అలాగే కార్మికులకు రావల్సిన చీపుర్లు, మిగతా కిట్స్‌ పంపిణీ చేయాలని కోరారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత



సుభాష్‌నగర్‌: కాలనీ ప్రజల అవసరాల నిమిత్తం వదిలేసిన స్థలంలో ఓ వ్యక్తి తప్పుడు పత్రాలు సృష్టించి సదరు స్థలంలో చేపట్టిన నిర్మాణాన్ని అధికారులు బుధవారం కూల్చివేశారు. గాజులరామారం డివిజన్‌ మహాదేవపురం కాలనీ ఏ బ్లాక్‌లో కాలనీలో మిగులు స్థలంగా ఉన్న 90 గజాలను కాలనీ అవసరాల కోసం వదిలిపెట్టారు. సంక్రాంతి సెలవుల్లో ఓ వ్యక్తి తప్పుడు నోటరీని సృష్టించి చిన్నపాటి షెడ్డు, ప్రహరీ నిర్మించాడు. దీంతో సొసైటీ సభ్యులు హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. సదరు స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లను అధికారులు పరిశీలించారు. నోటరీ చేసుకున్న డాక్యుమెంట్లను తప్పుడు పత్రాలుగా ధ్రువీకరించి నిర్మాణాన్ని కూల్చి వేయమని టౌన్‌ ప్లానింగ్‌ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బుధవారం టౌన్‌ ప్లానింగ్‌ అధికారి తుల్జాసింగ్‌ నేతృత్వంలో జేసీబీతో షెడ్డును కూల్చివేశారు.

కలెక్టరేట్‌ ఎదుట ఆశావర్కర్ల ఆందోళన



సాక్షి,సిటీబ్యూరో: ఆశ వర్కర్లను పర్మనెంట్‌ చేయడంతో పాటు నెలకు ఫిక్స్‌డ్‌ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అశోక్‌ ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. ఈఎస్‌ఐ, పీఎఫ్‌ వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. బుధవారం కలెక్టరేట్‌ ఎదుట తెలంగాణ ఆశావర్కర్స్‌ యూనియన్‌ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఆశావర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశావర్కర్స్‌ యూనియన్‌ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హేమలత, రేవతి కల్యాణి మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ ప్రభుత్వం ఆశాల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి ఉన్నీకృష్ణన్‌, ప్రజాపాలన ప్రభుత్వంలో ఇప్పటి వరకు 300 మంది ఆశావర్కర్లతో సహా సీఐటీయూ జిల్లా నాయకులు రాజశేఖర్‌ లింగస్వామిలను అరెస్టు చేశారని, వారిని వెంటనే విడుదల చేయాలన్నారు. సీఐటీయూ శామీర్‌పేట్‌ కార్యదర్శి కృష్ణప్ప, ఆశావర్కర్లు రాధ, యాదమ్మ, లలిత, కోమలత, మంగ తదితరులున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ


వివరాలు సేకరిస్తున్న సీఐ భరత్‌కుమార్‌

సుభాష్‌నగర్‌: తాళం వేసి ఉన్న ఇంటిని దొంగలు లూటీ చేశారు. ఈ ఘటన సూరారం పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. సీఐ భరత్‌ కుమార్‌ వివరాల ప్రకారం.. గాజులరామారం డివిజన్‌ వీనస్‌ ఎన్‌క్లేవ్‌లో జాఫర్‌ అనే వ్యక్తి తన కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. కుటుంబ సభ్యులతో కలిసి సొంతూరు కర్నూలుకు వెళ్లాడు. మంగళవారం తిరిగి ఇంటికి రాగా.. ఇంటి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లో దాచిపెట్టిన 22 తులాల బంగారు ఆభరణాలు, 80 తులాల వెండి చోరీకి గురైంది. ఈ విషయమై జాఫర్‌ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సీఐ భరత్‌ కుమార్‌ తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో వ్యక్తి మృతి


అమీర్‌కుమార్‌(ఫైల్‌)

కుత్బుల్లాపూర్‌: మద్యం మత్తులో గుండెపోటు రావడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన పేట్‌బషీరాబాద్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన అమీర్‌కుమార్‌ (42), సుచిస్మిత భార్యాభర్తలు. వీరికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. వ్యాపారం చేసే అమీర్‌కుమార్‌ కుటుంబం కొంపల్లిలోని అపర్ణ తులిప్‌లో నివాసం ఉంటుంది. కుటుంబ కలహాల నేపథ్యంలో నాలుగు రోజుల క్రితం సుచిస్మిత ఒడిస్సాలోని తన పుట్టింటికి వెళ్లింది. మంగళవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో అమీర్‌కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడిన భార్య తిరిగి బుధవారం మరోసారి కాల్‌ చేయగా అతను లిఫ్ట్‌ చేయలేదు. దీంతో అనుమానం వచ్చి పక్కింటి వారికి ఫోన్‌ చేయగా.. వారు బాల్కనీలోంచి వెళ్లి చూడగా అతను అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. వెంటనే 108కు కాల్‌ చేశారు. పరిశీలించిన సిబ్బంది అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అతిగా మద్యం సేవించడంతో గుండెపోటు వచ్చి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.